'సుందరీకరణ పేరుతో ఇబ్బంది పెడుతున్నారు'



చిరువ్యాపారులతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

సనత్‌నగర్: సుందరీకరణ పేరిట వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం తగదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో అమీర్‌పేట మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, హనుమాన్ టెంపుల్, కనకదుర్గమ్మ టెంపుల్ తదితర ప్రాంతాల్లో అనేక మంది పేదలు ఎన్నో ఏళ్లుగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్ల అభివృద్ధి, సుందరీకరణ పేరుతో చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అదే విధంగా షాపుల ముందు ఫుట్‌పాత్‌లను ఎత్తుగా నిర్మిస్తున్నారని, దీని ద్వారా దుకాణదారులు, కస్టమర్లు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందవద్దని, సంబంధిత అధికారులతో కలిసి శనివారం అమీర్‌పేటలో పర్యటిస్తానని చెప్పారు.

డిజిటల్ రంగంలో దేశం దూసుకుపోతోంది

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కేతినేని డిజిటల్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

అమీర్‌పేట్: డిజిటల్ రంగంలో దేశం దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అమీర్‌పేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కేతినేని డిజిటల్స్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో చిన్న చిన్న సమావేశాలతో పాటు భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసినప్పుడు సాధారణ స్క్రీన్స్ మాత్రమే ఉండేవని పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేడు ఎల్‌ఈడీ స్క్రీన్స్ వినియోగం పెరిగిందని నగరంలో ఇంత పెద్ద ఎత్తున స్క్రీన్స్‌కు సంబంధించిన స్టోర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కేతినేని డిజిటల్స్ అధినేత, అమీర్‌పేట్ కార్పొరేటర్ కేతినేని సరళను అభినందించారు. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, దర్శకుడు వైవీఎస్. చౌదరి, కళామందిర్ కళ్యాణ్, మా ఆర్ట్స్ అధినేత చింతల రామారావు, చింతల రవికుమార్, చెన్నుపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు విస్మరించి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు



ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

సికింద్రాబాద్: నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వందలాది మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగానే ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం మెట్టుగూడ–ఆలుగడ్డబావి ప్రధానహదారిలో చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాల తనిఖీలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ..



విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు

పద్మారావునగర్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో బోలక్‌పూర్ శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. వివిధ విభాగాల్లో తమ సత్తా చాటి బహుమతులను గెల్చుకున్నారు. భారత్‌స్కౌట్స్ అండ్‌గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇటీవల సికింద్రాబాద్‌లో విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెల్చుపొందిన విద్యార్థులకు డిప్యూటీ డీఈఓ శ్రీధర్ బహుమతులను అందజేశారు. శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు క్విజ్‌లో మొదటి బహుమతి అదే విధంగా బ్యాండ్ పార్టీలో చూపిన ప్రతిభకు స్పెషల్ బహుమతిని అందుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, వరలక్ష్మి, జ్యోతి, సంపూర్ణ, ఐలయ్య, స్కౌట్ మాస్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమహా రుద్రయాగం



శ్రీమహారుద్రయాగం నిర్వహిస్తున్న ఋత్వికులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీగిరి తిరుపాదమండపంలో శ్రీమహారుద్రయాగం భక్తిశ్రద్ధలతో శుక్రవారం ప్రారంభమైంది. వేదపండితుడు రాధకృష్ణశర్మ బ్రహ్మత్వంలో 25 మంది ఋత్వికుల నేతృత్వంలో మహాన్యాసం, ఏకాదశ రుద్రపారాయణం, అభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సకల జనుల శ్రేయస్సు, విశ్వశాంతి, లోక కళ్యాణార్థం శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు శ్రీమహారుద్రయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేష్‌కుమార్‌లు తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక దీపోత్సవం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

జాబితాలో పేరు నమోదు చేసుకోండి

- సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు
- రేపు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక బృందాలు

సికింద్రాబాద్: ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం కోసం ఎన్నికల కమిషన్ అధికారులు ఇచ్చిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల సికింద్రాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారులు విడుదల చేసిన ఓటర్ల జాబితా డ్రాఫ్టురోల్‌లో మరిన్ని సవరణలు చేసుకునే అవకాశం లభించిందని డిప్యూటీ కమిషనర్ చెప్పారు. ఈ నెల 9,10 తేదీల్లో నియోజకవర్గం పరిధిలోని 102 భవనాల్లోని 220 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా డ్రాఫ్టురోల్‌ను అందుబాటులో ఉంచుతున్నామని ఆయన అన్నారు. జాబితాతోపాటు జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం సిబ్బంది అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఓటర్లు తమ సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి జాబితాలో తమ పేరు ఉన్నది లేనిది పరిశీలించుకోవచ్చునని చెప్పారు. జాబితాలో పేరు లేకపోతే అక్కడే అవసరమైన ధృవీకరణలు అందించి పేరు నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. ఒకవేళ జాబితాలో పేరు నమోదై ఉండి చిరునామాలో తప్పొప్పులు ఉన్నా కూడా సవరణలు పోలింగ్ కేంద్రాల్లోనే చేసుకోవచ్చునని చెప్పారు. వయసు, చిరునామాకు సంబంధించిన ధృవీకరణలు మాత్రమే వెంట తెచ్చుకోవాలని, అందుకు అవసరమైన ఫామ్‌లు అన్నింటిని పోలింగ్ కేంద్రాల్లోనే అందుబాటులో ఉంచామని డిప్యూటీ కమిషనర్ చెప్పారు. రెండు రోజులపాటు కొనసాగే ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం రాజకీయ పార్టీల నాయకులు, కాలనీలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు నగరపు శ్యామ్, ప్రకాశ్, నర్సింగరావు, రాజసుందర్ (బీఆర్‌ఎస్), ఎస్. ప్రవీణ్‌కుమార్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు

విస్తరణ బాధితులకు బోర్డు అండ

- పరిహారంపై తేల్చాల్సిందేనని తీర్మానం
- తాగునీటి బిల్లుల బకాయిలకు ఓటీఎస్



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న బోర్డు సభ్యులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ బాధితులకు కంటోన్మెంట్ బోర్డు అండగా నిలిచింది.. పరిహారంపై పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చాకే విస్తరించాలంటూ తీర్మానించింది. రోడ్డు విస్తరణ కారణంగా కోల్పోయే భూములకు సంబంధించిన పరిహారానికి బదులుగా ఇక్కడి నాలాలను ఆధునీకరించడంతో పాటు, బోర్డు పరిధిలో పూర్తిస్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందిగా బోర్డు ప్రతిపాదించింది. ఇక బోర్డు విషయానికి వస్తే కంటోన్మెంట్ పరిధిలోని తాగునీటి బిల్లుల బకాయిల చెల్లింపునకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమును ప్రకటించారు. బకాయిల్లో 10 శాతం రిబేట్ ఇచ్చేందుకు బోర్డు అంగీకారం తెలిపింది. అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్‌వీ నంజుండేశ్వర ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డు సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు.

- ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి సంబంధించి కంటోన్మెంట్ పరిధిలోని జాతీయ రహదారి –44 మార్గంలో ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు, రాష్ట్ర రహదారి –1 మార్గంలో ప్యాట్నీ సెంటర్ నుంచి హకీంపేట వరకు రోడ్లను 60 మీటర్లకు విస్తరించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఈ ప్రతిపాదనపై పునరాలోచించుకుని, రోడ్డు విస్తరణను 40 మీటర్లకు పరిమితం చేయాల్సిందిగా గత ఆగస్టులో జరిగిన బోర్డు సమావేశంలో సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అనడంతో మరోసారి ఈ అంశం బోర్డులో చర్చకు వచ్చింది.
- ప్రతిపాదిత రోడ్డు విస్తరణ కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు తమ ఆస్తులతో పాటు, ఉపాధిని కూడా కోల్పోయే ప్రమాదముందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక టెక్నాలజీని వినియోగించి, భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది కలగకుండా 40 మీటర్లు మాత్రమే విస్తరించి రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఎంపీ సూచనలతో ఏకీభవించిన బోర్డు అధ్యక్షుడు, ఈ అంశంపై పునరాలోచించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి లేఖ రాస్తామన్నారు.
- రోడ్డు విస్తరణ కారణంగా బోర్డుకు దక్కాల్సిన రూ.303 కోట్ల పరిహారానికి బదులుగా, కంటోన్మెంట్ పరిధిలోని నాలాలను ఆధునీకరించడంతో పాటు పూర్తిస్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాల్సిందిగా బోర్డు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది.
- కంటోన్మెంట్‌లో కమ్యూనిటీ హాళ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, యువతకు జీవనోపాధి కల్పించేలా తీర్చిదిద్దాలని ఎంపీ సూచించారు. అయితే ఇందుకు తమ వద్ద నిధులు అందుబాటులో లేవని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు.
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్‌కు రావాల్సిన టీపీటీ బకాయిలు రూ.50 కోట్లకు, కేంద్రం నుంచి రావాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు రూ.900 మేరకు ఉన్నట్లు ఎంపీకి తెలిపారు. సర్వీసు చార్జీల అంశంపై ఈ దఫా ఢిల్లీకి వెళ్లినప్పుడు రక్షణ మంత్రిని కలిసి ప్రత్యేకంగా విన్నవిస్తానని ఎంపీ తెలిపారు.
- ఇక రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన టీపీటీ బకాయిలపై గతంలో తాను హైకోర్టుకు వెళ్లాకే చెల్లింపులు జరిగాయని బోర్డు సభ్యుడు రామకృష్ణ తెలిపారు. ఈ విషయమై మరోసారి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని తీర్మానించారు.
- కంటోన్మెంట్ పరిధిలోని 15 అక్రమ నిర్మాణాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు.
- సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని తాగునీటి బిల్లుల బకాయిల చెల్లింపునకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీము (ఓటీఎస్) అమలుకు బోర్డు ఆమోదం తెలిపింది. నల్లా బిల్లుల బకాయిలపై 10 శాతం రిబేటు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: మైత్రీవనం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆదిత్యబ్లాక్, ఆదిత్య వింధ్య బ్లాక్, కుమ్మరిబస్తీ, ఇమ్రోజ్ హోటల్‌లేన్, ఆనంద్ బజార్ లేన్, జీన్స్ కార్నర్, కాకతీయ మెస్, డెల్టా ఛాంబర్స్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గాయత్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో .. రూపాయల్లో..) టమాటా.29, నల్లవంకాయ 50, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 80, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 37, క్యారెట్ 65, దొండ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 70, గోకరకాయ 45, కీర 17, దోసకాయ 40, బీట్‌రూట్ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 38, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 17, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కులాల ఆధిపత్యం పోవాలంటే కులగణన జరగాల్సిందే

లాలాపేట: కులాల మధ్య వ్యత్యాసాలు తగ్గి ఆధిపత్యం పోవాలంటే కులగణన జరగాలనీ సమాజ్‌వాది పార్టీ(ఎస్పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. శుక్రవారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరుకునే మోడల్ కుల సర్వేను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించాలని సూచించారు. కుల గణనన దేశావ్యాప్తంగా జరగాలనీ డిమాండ్ చేశారు.

సరోజకు డాక్టరేట్



లకావత్ సరోజ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.నరేష్‌రెడ్డి పర్యవేక్షణలో లకావత్ సరోజ పీహెచ్‌డీ పూర్తి చేశారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్ అధ్యాపకురాలుగా పని చేస్తున్న లకావత్ సరోజ ద్రవిడ వర్సిటీలో పరిశోధనలు పూర్తి చేయగా డాక్టరేట్‌ను ప్రకటించారు. ఫైనాన్షియల్ ఫర్ఫమెన్స్ ఆఫ్ న్యూ ప్రవేటు సెక్టార్ బ్యాంక్స్ ఇన్ ఇండియా అనే అంశం పై పరిశోధన పూర్తి చేసిన్నట్లు తెలిపారు.

వ్యక్తి దృశ్యం



నసీర్

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ షాహీద్ పాషా తెలిపిన వివరాల ప్రకారం... నార్త్ లాలాగూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ నసీర్(39) పెయింట్ షాప్‌లో పని చేస్తుంటాడు. ఇతనికి భార్య, నలుగురు పిల్లలు. గత నెల 17న ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన నసీర్ మళ్లీ తిరిగి రాలేదు. దీంతో అతని భార్య నుస్రత్ జహాన్ భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులను, స్నేహితులను వాకబు చేసింది. ఫలితం కనిపించకపోవడంతో శుక్రవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

రసూల్‌పురా: ఇటీవల మైనర్లు వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగి అనేక మంది దుర్మరణం పాలవుతున్నారని చట్టరీత్యా మైనర్లు వాహనం నడపడం నేరమని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు తెలిపారు. శుక్రవారం బాలంరాయి ప్రభుత్వ పాఠశాల్లో రోడ్డు భద్రతపై విద్యార్థులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు, వాహన యజమానికి చట్టప్రకారం జైలుశిక్ష, జరిమానా, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు, ట్రాఫిక్ సాధిక్, శ్రావణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకంపై ప్రయాణికులతో ముచ్చట



ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆదం సంతోష్‌కుమార్

లాలాపేట: లాలాపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తార్నాక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బ్రహ్మజీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజక వర్గం నాయకులు పాల్గొన్నారు. సీఎం జన్మదినం సందర్భంగా మహిళలకు స్వీట్లు పంపణీ చేశారు.

అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర కీలకం



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

పంజగుట్ట: అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర ఎంతో కీలకమని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్ర సంఘటన్, కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖల సహకారంతో శుక్రవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై నాగరాజు, సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అవినీతిని అంతమొందించడంలో ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అవినీతి లేని సమాజం రూపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ మార్పు ఎక్కడ నుంచో రావాలని చూడకూడదని, మననుంచే మార్పు రావాలని అవినీతి ఎక్కడ జరిగినా ధైర్యంగా నిలదీయాలన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ సమాజంలో అవినీతి, లంచగొండితనం మితిమీరిపోయిందని, దాన్ని అరికట్టేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొనగా డి.రాహుల్ ప్రథమ బహుమతి, బి.రవీందర్ ద్వితీయ బహుమతి, ఈ.శివ తృతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రవీందర్, ఎన్.విజయలక్ష్మి, అధ్యాపకులు వి.వి.సుబ్బారావు, జగన్నాథరావు, గిరిధర్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నచ్చిన రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

ఘనంగా విజ్ఞానజ్యోతి స్పోర్ట్స్ డే వేడుకలు

వెంగళరావునగర్: విద్యార్థులకు నచ్చిన రంగాల్లో వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని మాజీ ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేది, ప్రముఖ సినీ నిర్మాత, విజ్ఞానజ్యోతి స్కూల్ అధ్యక్షులు డి.సురేష్‌బాబులు అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని విజ్ఞానజ్యోతి పబ్లిక్‌స్కూల్ యాన్యువల్ స్పోర్ట్స్ డే వేడుకలు శుక్రవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది క్రీడాకారులు చదువులో కాకుండా క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించొచ్చని నిరూపించారన్నారు. నేటి సమాజంలో చదువుతో పాటుగా అనేక రంగాల్లో రాణిస్తూ తమ ప్రతిభను నిరూపించుకున్న వారు ఎందరో ఉన్నారని, వారిని నేటి తరం విద్యార్థినీ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు మాత్రమే చాలంటూ వారిపై అనవసరమైన ఒత్తిడిని తీసుకువస్తున్నారని, దానిని తట్టుకోలేక విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తమ పిల్లలకు ఏ రంగంలో ఇష్టమో ఆ రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. విజ్ఞానాన్ని నేర్పించే చదువుతో పాటుగా పిల్లలు ఆటపాటల్లో దృష్టి సారించాలని సూచించారు. తొలుత విద్యార్థులు వివిధ క్రీడల్లో తమకున్న ప్రావీణ్యతను వ్యక్త పరిచారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జి.కృష్ణప్రసాద్, మాజీ ఐపీఎస్ అధికారి దుర్గాప్రసాద్, సీనియర్ ప్రిన్సిపాల్ జె.అరుణ కుమారి, పెద్ద సంఖ్యలో టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిలకలగూడలో బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగులూరి సాయిబాబా

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

చిలకలగూడ : తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగులూరి సాయిబాబా నేతృత్వంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిలకలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బర్త్‌డే కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుతు సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, శ్యామ్, అంజి, వెంకట్, మనోహర్‌బాబు, బొట్టు శ్రీను, రవిశంకర్, లలిత, రామలీల, ఉమాదేవి, అభిషేక్, రవిముదిరాజ్, సతీష్, ప్రమోద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో రోగులకు పండ్లు పంపిణీ



గాంధీరోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాగులూరి సాయిబాబా, సూపరింటెండెంట్ రాజకుమారి, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి

గాంధీఆస్పత్రి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ వైస్‌చైర్మన్ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో శుక్రవారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎన్ రాజకుమారి, ఆర్‌ఎంఓ–1 శేషాద్రిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పలువార్డులు తిరుగుతు రోగులకు పండ్లు పంచుతు వారి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుని త్వరితగతిన స్వస్థత చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ యోగేందర్, కాంగ్రెస్ నాయకులు జలంధర్‌రెడ్డి, శ్యామ్, అంజి, వెంకట్, మనోహర్‌బాబు, బొట్టు శ్రీను, రవిశంకర్, లలిత, రామలీల, ఉమాదేవి, సతీష్, ప్రమోద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సనత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం బేగంపేట డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రకాష్‌నగర్ ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సూదం ముఖ్యఅతిథిగా హాజరై రక్తదానం చేశారు. పాటిగడ్డలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసిన అనంతరం మొక్కలు నాటారు. ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గూడీస్‌ను పంపిణీ చేశారు. శ్యాంలాల్ బిల్డింగ్స్ డాన్‌బడ్స్ ప్రాథమిక పాఠశాలలో డ్రాయింగ్ బుక్స్‌ను పంచిపెట్టారు.

సీఎం రేవంత్‌కు అందరూ అండగా నిలవాలి



డిప్యూటీ మేయర్ కార్యాలయం వద్ద సీఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

లాలాపేట: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలతశోభన్‌రెడ్డి బర్త్ డే కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

ఓయూలో ..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. శుక్రవారం వేర్వేరు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్‌కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికైన 1392 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేయాలని జన్మదిన వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్యోగాలకు ఎంపికైన వారు అభ్యర్థించారు.

నేడు ఓయూలో వర్కింగ్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నేడు (9న) వర్కింగ్ డే అని అధికారులు పేర్కొన్నారు. గత సెప్టెంబరు 9న సెలవు తీసుకునందున రెండో శనివారం రోజున వర్కింగ్ డేగా ప్రకటించారు. విద్యార్థులు, ఉద్యోగులు సహకరించాలని అధికారులు కోరారు.

కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షపాతి అని, కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. శుక్రవారం దళ్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంతో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అధినేత, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నాయకులు రాహుల్‌గాంధీ చొరవతోనే కులగణనకు శ్రీకారం చుట్టారన్నారు. అనేకేళ్ల తరువాత తెలంగాణ రాష్ట్రంలో కులగణనకు శ్రీకారం చుట్టడం గొప్ప పరిణామమన్నారు. రాహుల్‌గాంధీ ఎన్నికల ముందు కులగణన చేస్తామని హామీ ఇచ్చారని, ఆయన హామీ మేరకు ఇప్పుడు చేపట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కులగణన వల్ల ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఏ వర్గాలకు ఫలాలు అందాలో ఆ వర్గాలకు అందుతాయని ఆయన స్పష్టం చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లో నూతనంగా ఏర్పాటు చేసిన సెంచరీ మ్యాట్రిసెస్ స్లీప్ స్పెషలిస్ట్ స్టోర్‌ను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే వారి మన్ననలను పొందుతారని చెప్పారు. సెంచరీ ఫైబర్ ప్లేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ మాట్లాడుతూ కస్టమర్ల వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మ్యాట్రిసెస్‌ను ఆకర్షణీయమైన డిజైన్లతో రూపొందించడం జరుగుతుందన్నారు. సెంచరీ మ్యాట్రిసెస్ దేశంలో 4,500లకు పైగా అవుట్‌లెట్లు, 450కి పైగా ప్రత్యేక బ్రాండ్ స్టోర్ల నుంచి మల్టీబ్రాండ్ డీలర్లతో బలమైన వ్యాపార సామ్రాజ్యాన్ని కలిగి ఉందన్నారు.